# నాస్తిక ఋషులు

రామాయణ కాలంలో 'జాబాలి' అనే దశరథుని పురోహితులలో ఒకడుండేవాడు. అతడు తర్కశాస్త్ర ప్రవీణుడు. చార్వాక మతస్థుడు. శుద్ధ నాస్తికుడు. "మీ నాన్నగారు నిన్ను పదునాలుగేండ్లు వనవాసం చేయాలని కోరుతున్నారు" అనే కైకేయి చెప్పినప్పుడు రాముడు వనవాసానికి సిద్ధమయేడు. అప్పుడీ జాబాలి "రామా! నువ్వు దేశంలోని అన్ని వనాలలోను తిరుగాడలేవు. అయోధ్యకి దగ్గరగా వున్న వనంలో పదునాలుగేండ్లు గడిపి, వెంటనే రాజ్యానికి వచ్చేయ్" అని సలహా చెప్పేడు ఈ మాటలు విన్న రామునికి కోపం వచ్చింది. "కేవలం తర్కశాస్త్రాన్నే చదివినవారు నక్కలై పుడతారు" అని శపించేడు. తరువాత "వేదాంతములైన ఉపనిషత్తులు కూడా తర్కశాస్త్రాలతో అధ్యయనం చేస్తే శాప విముక్తులవుతారు" అని రాముడు శాపవిమోచనంకూడా చెప్పేడు. అందుకే ఆది శంకరులు కూడా "శ్రుతి మతః తర్కో అనుసంధీయతామ్" శ్రుతులు ప్రతిపాదించిన విషయాలకు తర్కం జోడించి అనుసంధానం చేయాలి అన్నారు.

చార్వాక ఋషులు ఇద్దరుండేవారు. ఇద్దరూ తపోధనులే! వారు భగవంతుని అస్తిత్వాన్ని అంగీకరించ నప్పుడు ఎవర్ని ధ్యేయంగా ధ్యానం చేసేరు? అని మనకు సందేహం వస్తుంది. వారు సహజ ప్రకృతిని ధ్యానం చేసేవారు. వీరిద్దరూ ఒకనాడు అడవుల గుండా ప్రయాణిస్తున్నారు. అక్కడొక గ్రామం వచ్చింది. అక్కడ రచ్చబండ మీద గ్రామాధికారులు కూర్చుని న్యాయ నిర్ణయం చేయాడానికి ఉద్యుక్తులవుతున్నారు. ప్రజలు ఒక యువతిని నిలబెట్టి "చెప్పు! ఎందుకిలా చేసేవు? పెళ్లి కాకుండా గర్భవతి కావడం, శాస్త్ర విరుద్ధం, సంఘ విద్రోహం!" అంటూ కొరడాలు ఝుళిపిస్తున్నారు. అదే సమయానికి చార్వాక ఋషులు అక్కడికి వచ్చేరు. ప్రజలంతా లేచి నిల్చుని చార్వాకులకు నమస్కరించేరు. వారు ఆసీనులయేక విషయం అడిగి తెలుసుకున్నారు.

"ముని పుంగవులారా! ఈ యువతి పెళ్లి కాకుం డానే గర్భవతి అయింది. ఈమెకు దండన విధిస్తున్నాం" అని చెప్పారు. అప్పుడు చార్వాకులు జోక్యంచేసుకుని -

"ఈమెను దండించడం తగదు. ఇది సాంఘిక న్యాయం కాదు. ఈమె ఎవరి వల్ల గర్భవతి అయిందో ఆ పురుషుణ్ణి దండించాలి. అతడు శిక్షార్హుడు!" అని తీర్పు చెప్పారు. ఈ తీర్పు వినగానే ఒక్కొక్కరూ చల్లగా జారుకుంటున్నారు. ఒకే ఒక్కడు, ఈ యువతి తన వల్లే మాతృమూర్తి కాబోతోందని అంగీకరించగా అప్పుడు అక్కడి పెద్దలు వారిద్దరికీ వివాహం జరిపించారు. నాస్తికులైన చార్వాకులు చేసిన మహోపకారం ఇది! సాంఘిక దురాచారాలను ఖండించడంలో ఆస్తికులదీ నాస్తికులదీ ఒకే విధానం.

విజయవాడ (పటమట) లో నాస్తిక కేంద్ర వ్యవ-స్థాపకులు గోరాగారు సర్వోదయ , భూదానోద్యమాలలో ప్రవేశించేటప్పుడు ఆచార్య వినోబాభావే - "ఆస్తికులూ- నాస్తికులూ నాణానికి బొమ్మా బొరుసూ లాంటి వారు. ఏ ఒకటి లేకపోయినా నాణెం చెల్లదు!" అన్నారు. సుమారు ఇరవై ఏళ్ల క్రిందట ఆచార్య సి.నా.రె. మహోదయులు నార్ల వెంకటేశ్వరరావు గారి ఇంటి ప్రక్కగా వెళుతూ వారితో ఇంటర్వ్యూ చేసి, నార్ల వారిని 'నాస్తిక ఋషి' అని అభివర్ణించారు.

భగవంతుని ఇరువదొక్క అవతారాలలో సాంఖ్య శాస్త్రం ప్రవచించిన కపిల మహాముని వున్నాడు. అతడు 'ఈశ్వరుడు లేడు' అనే 'నిరీశ్వర' వాదాన్ని ప్రతిపాదించాడు. భగవంతుడై వుండి 'నిరీశ్వరత్వాన్ని' ఎలా ప్రతిపాదించాడా అనిపిస్తుంది మనకు. కాని, తానే 'ఈశ్వరుడు' కావడం వల్ల వేరొక ఈశ్వరుడు లేడంటూ నిరీశ్వరత్వాన్ని బోధించాడు. ఆస్తికులు నాస్తికులు పరస్పరం ఒకరి అభిప్రాయాలను ఒకరు మన్నించుకుంటూ సహజీవనం సాగించాలి. ఇరువురూ సమాజశ్రేయస్సుకు విభిన్న మార్గాలలో పాటుపడుతున్నవారే!

అక్టోబర్ 2005
"పత్రిక" మనమాస పత్రిక

కథా నిలయం
5845
శ్రీకాకుళం